బస్సులు.. రైళ్లు కిటకిట

- ఇంటర్ విద్యార్థులకు సెలవుతో రద్దీ
- స్టాండ్‌లోకి చేరకనే కిక్కిరిసిన బస్సులు
- ప్లాట్ ఫాం పట్టక.. ట్రాక్‌పైకి ప్రయాణికులు



8



శాంతి దుర్గా నమోస్తుతే..!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆరో రోజు అనంతపురం నగరంలోని కొత్తూరు అమ్మవారిశాలలో ఉత్సవమూర్తులకు శాంతిదుర్గ, కరుమారిదేవి, సమయపురం మరియమ్మ అలంకారాలను చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



ఈ-తంటా..!

ముంచుకొస్తున్న గడువు



కణేకల్లులో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

లక్ష్యం చేరని ఈ-పంట నమోదు

ఇప్పటి వరకు 6.54 లక్షల ఎకరాల్లోనే నమోదు

కొత్త నిబంధనతో క్షేత్రస్థాయి సిబ్బందికి ఇబ్బందులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గడువు ముంచుకొస్తున్న ఈ పంట నమోదు జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ఈఏడాది ఖరీఫ్‌కు పొడిగించిన గడువు మరో రెండు రోజుల్లో ముగియనుంది. రైతులు బీమా, నష్టపరిహారంతోపాటు ఇతర రకాల లబ్ధి పొందాలంటే ఈ పంట నమోదే కీలకం. ఇలాంటి కీలకమైన ఈ పంట నమోదుపై పలువురు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ ఏడాది జూలై మూడో వారం నుంచి ఈ పంట నమోదు మొదలైంది. తొలుత ఈనెల 15 వరకే గడువు విధించారు. ఈనెల 30న ఈ పంట తుది జాబితాను విడుదల చేయాలని గతంలో రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జిల్లాలో క్షేత్రస్థాయిలో ఈ పంట నమోదు నత్తనడకగా సాగుతున్న క్రమంలో ఈనెలాఖరు దాకా గడువు పొడిగించారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పలు మార్లు పర్యవేక్షించినా, జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ పంట నమోదు కొలిక్కి రావడం లేదు. ఈనేపథ్యంలో మరికొన్ని రోజులు సమయం ఇవ్వకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

లక్ష్యం చేరేదెన్నడో..?

సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ పంట నమోదు సకాలంలో పూర్తి కావడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. జిల్లాలో వ్యవసాయ శాఖ 9.5 లక్షల ఎకరాల్లో ఈ పంట నమోదు చేయాల్సి ఉండగా 6.54 లక్షల ఎకరాల్లో మాత్రమే చేశారు. పలు మండలాల్లో సంబంధిత ఏఓలు రైతుల జాబితాను రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎంపీఈఓలకు కేటాయించడంలో తీవ్ర జాప్యం చేయడంతో సమస్య తలెత్తినట్లు సమాచారం. మరికొన్ని మండలాల్లో జాబితాను సిబ్బందికి కేటాయించినా క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. ఉద్యాన పంటలకు సంబంధించిన ఈ పంట నమోదులోనూ సంబంధిత అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 3.12 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి.

ఇప్పటి దాకా 1.57 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు నమోదు చేశారు. ఇందులో అరటి, చీనీ, మామిడి, దానిమ్మ, బొప్పాయి, ఇతర పండ్ల తోటలు 1.16 లక్షల ఎకరాలు, కూరగాయ పంటలు 27242 ఎకరాలు, సుగంధ ద్రవ్యాలు 11495 ఎకరాలు, కొబ్బరి, వక్క పంటలు 1888, పూల తోటలు 875 ఎకరాల్లో ఈ పంట నమోదు చేశారు. మరోవైపు జిల్లాలోని ఆరు మండలాల్లో 400 ఎకరాల్లో ఆయిల్ పాం సాగవుతోంది. ఇప్పటి దాకా ఆయిల్ పాం పంటకు సంబంధించి ఈ పంట నమోదు చేయలేదు. ఈ సారి తోటల్లో గట్టు మీద పెంచే కొబ్బరి, తాటిచెట్లు, చింత, అల్ల నేరేడు ఇతర రకాల చెట్లను ఈ పంట నమోదు చేయాలన్న నిబంధన విధించారు. ఇదంతా కష్టతరంగా మారినట్లు సంబంధిత ఉద్యోగులు చెబుతున్నారు.

కొత్త నిబంధనలతో ఇబ్బందులు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఈ పంట నమోదు ప్రక్రియలో కొత్త నిబంధనలతో రైతు సేవా కేంద్రం సిబ్బంది ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. జియో కోఆర్డినేట్స్ ద్వారా పొలంలో రైతును నిలిబెట్టి ఫొటో తీసి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గత ఏడాది 50 మీటర్ల దూరం వరకు జియో కోఆర్డినేట్స్‌తో ఫొటో తీసేందుకు అవకాశం ఉండేది. ఈ సారి 5.1 వర్షన్‌లో 20 మీటర్ల దూరానికి కుదించారు. వరి పంటకు మాత్రమే 50 మీటర్ల దూరం వరకు అవకాశం ఇచ్చారు. మిగతా పంటలకు 20 మీటర్లే ఇచ్చారు. ఈ ఏడాది బీడు భూములను సైతం జియో కోఆర్డినేట్స్ ద్వారా నమోదు చేయాలని షరతు విధించారు. పంట సాగు చేయని బీడు భూముల వద్దకు సిబ్బంది వెళ్లి జియో కోఆర్డినేట్స్ ద్వారా ఫొటో తీస్తుండటంపై పలు ప్రాంతాల్లో అధికార, ప్రతిపక్ష నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమ బీడు భూములను కూడా పంట సాగు చేసినట్లు నమోదు చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొందరు సిబ్బంది బీడు భూముల జోలికి వెళ్లకుండా ముందుగా పంట సాగు చేసిన పొలాలను నమోదు చేసుకుంటున్నట్లు సమాచారం.

వంద శాతం నమోదుకు చర్యలు

ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి వంద శాతం ఈ పంట నమోదు జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఈ సారి సాగైన పంటలతోపాటు బీడు భూములను జియో కోఆర్డినేట్స్ ద్వారా నమోదు చేయాలని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదులో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించి, పంట సాగు చేసిన రైతులందరికి న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి పొడిగింపు ఉత్తర్వులు రాగానే సమాచారం అందజేస్తాం.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

పాఠశాల అభివృద్ధిలో హెచ్‌ఎంలు కీలకం: డీఈఓ

అనంతపురం విద్య, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో హెచ్‌ఎంల పాత్ర కీలకమని డీఈఓ ప్రసాద్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో కొత్త హెచ్‌ఎంలకు హెచ్‌ఎంల సంఘం ఆధ్వర్యంలో శనివారం శిక్షణా తరగతులను నిర్వహించారు. డీఈఓ, డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసులు హాజరయ్యారు. విద్యారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని, ప్రతి పాఠశాలకు ఏటా నిధులు ఇస్తున్నాయని డీఈఓ వివరించారు. వాటిని నిబంధనలు, మార్గదర్శకాల మేరకే ఖర్చు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో సఖ్యతగా మెలగాలని సూచించారు. యాప్‌ల నమోదుపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. విద్యార్థులకు మంచి బోధన అందేలా చూడాలని కోరారు. సమావేశంలో హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కోశాధికారి భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికరాజ్య స్థాపనతోనే సమాజ రక్షణ

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

ఘనంగా మొదలైన సీఐటీయూ జిల్లా 11వ మహాసభలు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్మిక రాజ్య స్థాపనతోనే సమాజ రక్షణ సాధ్యమని, అదే లక్ష్యంగా కార్మికవర్గం ముందుకు సాగాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. నగరంలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో శనివారం జరిగిన సీఐటీయూ జిల్లా 11వ మహాసభలలో ఆయన ప్రసంగించారు. అంతకు మునుపు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీనియర్ నాయకుడు ఏజీ రాజమోహన్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ ఆఫీస్ బేరర్స్ నాగమణి, సాకే నాగరాజు, శ్రీనివాసులు సంయుక్త అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన నాయకులు, కార్యకర్తలు, కార్మికులకు సంతాప తీర్మానాన్ని కమిటీ సభ్యుడు గోపాల్ ప్రవేశపెట్టి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడారు. దేశంలో శ్రమదోపిడీ పెరిగిందని, ప్రధాని మోదీ

(మిగతా 8వ పేజీలో)

ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు ఒకటో తేదీ ఉదయం నుంచి లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము అందజేస్తారని డీఆర్‌డీఏ పీడీ శైలజ శనివారం తెలిపారు. పింఛన్ సొమ్ము కోసం సచివాలయాలు, ఇతర కార్యాలయల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. అక్టోబరు 2వ తేదీ సెలవు అని, తొలి రోజు పింఛన్ తీసుకోనివారికి స్థానిక సచివాలయంలో 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంపిణీ చేస్తామని తెలిపారు.

బొమ్మల పండుగ

- జిల్లాలో పెరుగుతున్న బొమ్మలకొలువు సంప్రదాయం

(వివరాలు 9లో..)

జల విద్యుదుత్పత్తికి సన్నాహాలు

- పీఏబీఆర్‌లో 5 టీఎంసీల నిల్వ


కూడేరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు 5 టీఎంసీలకు చేరాయి. తుంగభద్ర డ్యాం నుంచి 105 క్యూసెక్కులు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 220 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి వస్తోంది. నీటిపారుదల శాఖ ఎస్ఈ సుధాకర్ రావు, డీఈ వెంకటరమణ తదితరులు డ్యాంను శనివారం సందర్శించారు. జల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించే విషయమై చర్చించారు. విద్యుదుత్పత్తి ప్రారంభించాలంటే సుమారు 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండాలి. ప్రస్తుత ఇన్‌ఫ్లో ఆధారంగా విద్యుదుత్పత్తి సాధ్యం కాదు. తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా గార్లదిన్నె మండలంలోని మిడ్ పెన్నార్ డ్యాంకు వెళ్తున్న 1000 క్యూసెక్కుల నీటిని పీఏబీఆర్‌లోకి మళ్లిస్తే.. ఇన్‌ఫ్లో 1,325 క్యూసెక్కులకు పెరుగుతుంది. ఇందులో విద్యుదుత్పత్తికి 800 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 130 క్యూసెక్కులను వినియోగించుకోవచ్చని అధికారులు అంచనా వేశారు. ఎస్ఈ, డీఈ తదితరులు జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించి, జెన్‌కో అధికారులతో చర్చించారు. నీటి నిల్వ, ఇన్‌ఫ్లో ఆధారంగా విద్యుదుత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని డీఈ తెలిపారు. ప్రస్తుతం ఉన్న 5 టీఎంసీలలో మూడు టీఎంసీలను తాగునీటికి, రెండు టీఎంసీలను చెరువులకు పంపిణీచేసే అవకాశం ఉందని తెలిపారు. మిడ్ పెన్నార్‌కు వేళ్లే నీటినీ పీఏబీఆర్ డ్యాంకు మళ్లిస్తే జలవిద్యుత్ ఉత్పత్తి సాధ్యమౌతుందని, దీనిపై రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. డ్యాం ప్రధాన గేట్ల పనితీరును అధికారులు పరిశీలించారు. ఏఈఈలు ముత్యాలప్ప, గంగమ్మ, లక్ష్మీదేవి, రేణుక తదితరులతో డ్యాం పరిస్థితి, ఇతర వివరాలను ఎస్ఈ అడిగి తెలుసుకున్నారు.



పీఏబీఆర్ డ్యాంను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్‌రావు



అనంతపురం బస్టాండులో రద్దీ



అనంతపురం రైల్వే స్టేషన్‌లో ట్రాక్.. ప్లాట్ ఫాం ప్రయాణికులు.. బెంగళూరు ప్యాసింజర్ ఎక్కేందుకు నిరీక్షణ



బస్సులో సీట్ల కోసం..

బస్సులు.. రైళ్లు కిటకిట

● ఇంటర్ విద్యార్థులకు సెలవుతో రద్దీ ● స్టాండ్‌లోకి చేరకనే కిక్కిరిసిన బస్సులు ● ప్లాట్ ఫాం పట్టక.. ట్రాక్‌పైకి ప్రయాణికులు

అనంతపురం న్యూటౌన్/టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ప్లాట్‌ఫాంపై నిలబడేందుకు చోటు లేక చాలామంది ట్రాక్ పైకి వెళ్లారు. మిడ్ టర్మ్ పరీక్షలు పూర్తి కావడంతో ఇంటర్ విద్యార్థులకు శనివారం నుంచి సెలవులు ప్రకటించారు. హాస్టల్ విద్యార్థులంతా సొంతూరి బాట పట్టారు. ఈ కారణంగా బస్సులు, రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. అనంతపురం బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లక ముందే బయటే నిండిపోయాయి. స్టాండ్‌లోకి కూడా రాకుండా బయటి నుంచి కొన్ని బస్సులు వెళ్లిపోయాయి. ఇక బెంగళూరు ప్యాసింజర్ (66560) రైలుకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ప్యాసింజర్ ట్రైన్ మధ్యాహ్నం 2.10 గంటలకు ఉన్నా.. 12 గంటలకే ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకుని వేచి చూశారు. రైలు 20 నిమిషాలు ఆలస్యంగా స్టేషన్‌కు చేరుకుంది. నాలుగో నంబరు ప్లాట్‌ఫాం పైకి రైలు వస్తుందని అనౌన్స్‌మెంట్ వినగానే ప్రయాణికులు ఒక్కసారిగా 3వ నంబర్ ప్లాట్‌ఫాం వైపు నుంచి ట్రాక్‌పైకి దూకేశారు. రైలు రాగానే సీట్ల కోసం తోసుకుంటూ లోపలికి వెళ్లారు. రద్దీ నియంత్రణకు రైల్వే శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో పరిస్థితి ప్రమాదకరంగా కనిపించింది.





బస్టాండ్ బయటే బస్సెక్కుదాం.. పద తల్లీ..



మనూరి బస్సు అక్కడే నిలబడింది.. పరిగెత్తండి..



నిలబడేందుకు స్థలం ఉన్నా చాలు.. ఊరికి పోదాం..



రైలు కదిలేలోగా దూరిపోదాం..

జనగణనలో కులగణన చేపట్టాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టాలని రాజకీయ, కుల, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్జీఓ హోంలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ మేయర్ రాగే పరశురాం, బీసీ సంఘాల రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప, కాంగ్రెస్ నాయకులు సాకే శంకర్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలుగా 5 నుంచి 15 శాతం వరకూ ఉన్న అగ్రకులాల నాయకులు పాలన సాగిస్తున్నారని అన్నారు. బీసీ కులాల నాయకులు 50 నుంచి 70 శాతం ఉన్నా.. చిన్న చిన్న పోస్టులను అడుక్కునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీ కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కులగణన చేపట్టి, ఆ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించారని అన్నారు. మన రాష్ట్రంలో ఎన్నికల సమయంలో బీసీల జపం చేస్తూనే, కులగణనకు ముందుకు రావడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి హక్కులను సాధించుకునేందుకు బీసీ, ఎ స్సీ, ఎస్టీ, మైనార్టీ కుల సంఘాలతో ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. దీనికోసం అక్టోబరు 4న నగరంలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని నియోజకవర్గాల నుంచి బీసీలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సులో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పిస్తామని ఉన్నతి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసి, 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసున్న యువతీ యువకులు అర్హులని తెలిపారు.

ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఉంటుందని తెలిపారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి 35 రోజుల పాటు బెంగళూరులో ఇచ్చే ఉచిత శిక్షణకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబరులో సంప్రదించాలని కోరారు.

కార్మికరాజ్య స్థాపనతోనే సమాజ రక్షణ

(7వ పేజీ తరువాయి)

కార్మిక వ్యతిరేకి అని అన్నారు. సంపద సృష్టి కర్తలైన కార్మికులను ప్రోత్సహించాల్సింది పోయి పెట్టుబడిదారులకు దాసోహమయ్యేలా లేబర్ కోడ్‌లు తెచ్చారని మండిపడ్డారు. బ్రిటీష్ పాలనలోనూ నిత్యావసర వస్తువులపై సుంకాలు వేయలేదని, సంపన్నులకు మాత్రమే విధించేవారని అన్నారు. కానీ మోదీ ప్రభుత్వం నిత్యావసరాలపై పన్నులు విధించి, ఇప్పుడు తగ్గిస్తోందని అన్నారు. పీపీపీ విధానంతో పేదరికం లేకుండా చేస్తామంటూనే మరింత పేదరికంలోకి నెట్టివేసే విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. అత్యంత ధనికుడైన ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నిలిచారని, అయితే రాష్ట్రంలో కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా 10 గంటల పనివిధానాన్ని అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం నష్టదాయకమని అన్నా రు. ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పనివిధానం, కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్ట్ - అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఉచిత విద్య, వైద్యం తదితరవాటి అమలుకోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డిసెంబరు 31, జనవరి 1, 2, 3, 4వ తేదీల్లో విశాఖపట్నంలో సీఐటీయూ జాతీయ మహాసభలు జరుగుతాయని, అక్కడ భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

హక్కుల పరిరరక్షణే లక్ష్యం..

కార్మికుల హక్కులను కాపాడడమే సీఐటీయూ ఏకైక లక్ష్యమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. సమానపనికి సమాన వేతనం అమలు చేయించడమే ధ్యేయమని అన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో అనేక పోరాటాలు చేశామని అన్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం, ఆశా, అంగన్వాడీ, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు, ఉపాధి కూలీలు, ఆటో కార్మికుల సమస్యలపై పోరాడామని అన్నారు. మహాసభలకు కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, కౌలురైతు సంగం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్యలు మద్దతు తెలిపారు.

22ఎ ఫైళ్లకు పరిష్కారం

కలెక్టరేట్‌లో అధికారుల కుస్తీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 22ఎ భూముల ఫైళ్ల పరిష్కారానికి అధికారులు కుస్తీ పట్టారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు తమ పరిధిలోని ఫైళ్లను శుక్ర, శనివారాల్లో పరిశీలించారు. శుక్రవారం ఒక్క రోజే 80 ఫైళ్లకు పరిష్కారం చూపారు. ఇది వరకు ప్రతి శుక్రవారం 22ఎ, చుక్కల భూములకు పరిష్కారం చూపేవారు. కానీ ఒకేసారి అధిక సంఖ్యలో ఫైళ్లను వెరిఫై చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. దీంతో రెండు రోజుల వ్యవధిలోనే 900 పైచిలుకు ఫైళ్లను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ఇందులో 150 వరకు ఫైళ్లను పరిష్కరించి, మరికొన్ని తిరస్కరించారు. సరైన డాక్యుమెంట్లు లేనివాటిని మరోసారి పరిశీలించనున్నారు.

కొన్ని మాయం

మండలాల వారిగా 22ఎ ఫైళ్ల గురించి ఆన్‌లైన్ ఆధారంగా కలెక్టర్ ఆరా తీశారు. వాటిలో కొన్ని ఫైళ్లు మాన్యువల్‌గా మిస్ అయినట్లు తెలిసింది. వాటి గురించి నిలదీస్తే, వీఆర్‌ఓ, ఆర్‌ఐలు, డీటీలు, తహసీల్దార్లు ఒకరిపై మరొకరు చెప్పుకున్నట్లు తెలిసింది. మరోసారి పరిశీలించాలని, పత్రాలను దరఖాస్తుదారుల నుంచి తెప్పించుకోవాలని ఆదేశించారు. ఫైళ్ల తనిఖీని కలెక్టర్, జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల పర్యవేక్షించారు.



రెవెన్యూ భవన్‌లో 22ఎ ఫైళ్ల వెరిఫికేషన్‌లో అధికారులు, సిబ్బంది

ఉద్యోగోన్నతుల కోసం ఆందోళన



గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సీనియారిటీ జాబితాను వెంటనే ప్రకటించి, అర్హత ఆధారంగా ఉద్యోగోన్నతులను కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శనివారం భోజన విరామ సమయంలో నిరసనకు దిగారు. నగరంలోని అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన మూడు నోషనల్ ఇంక్రిమెంట్లు, 9 నెలల బకాయిలు చెల్లించాలని జేఏసీ నాయకులు సుధాకర్, మల్లికార్జున, హనుమంతు, చంద్ర డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు ఇంటింటి సర్వే సేవలను పూర్తి రద్దు చేయాలని అన్నారు. మాతృశాఖను నిర్ణయించి, జాబ్ చార్ట్ ప్రకారం విధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

గురువులకు నియామక పత్రాలు



నియామక పత్రాలను అందజేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఇతర కారణాలతో అమరావతిలో నిర్వహించిన మెగా డీఎస్సీ సభకు వెళ్లని కొత్త ఉపాధ్యాయులకు తన కార్యాలయంలో డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం నియామక పత్రాలన అందజేశారు. వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చిరు జల్లులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనంతపురం, ఉరవకొండ, గుత్తి, పుట్లూరు మండలాల్లో శనివారం చిరుజల్లులు పడ్డాయి. శుక్రవారం 21 మండలాల్లో వర్షం కురిసింది. విడపనకల్లులో 1.1, గుత్తిలో ఒక సెంటీ మీటరు వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

వదలని కంపు..!

ఆగిన అండర్ డ్రైనేజీ పనులు.. రోడ్లపై పారుతున్న మురుగునీరు

● రూ.కోటికిపైగా బిల్లులు మంజూరు ● దుర్గంధంతో శింగనమల ప్రజల ఇబ్బంది



డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన చెత్త

శింగనమల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన అండర్ డ్రైనేజీ పనులు ఆగిపోయాయి. బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ వాటిని అర్ధాంతరంగా ఆపేశాడు. దీంతో మురుగు నీరంతా గ్రామంలో రోడ్లపైనే ఎక్కడబడితే అక్కడ పారుతోంది. మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డి చదువుకున్న గ్రామమైన శింగనమలకు వైసీపీ పాలనలో అండర్ డ్రైనేజ్ వ్యవస్థను తీసుకువచ్చారు. ఇందుకోసం రూ.1.5కోట్ల నిధులను మంజూరు చేయించారు. పనుల కోసం 70శాతం ఉపాధి హామీ పథకం నిధులు, 30శాతం గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య (ఎస్‌బీఎం) నిధులు కేటాయించారు. దీంతో ఎస్సీకాలనీ నుంచి దర్గా వరకు కాలువలు తీశారు. మిగతా కొన్ని చోట్ల పనులు చేశారు. అయితే మురుగునీరు కాలువలోకి వెళ్లేలా చేయకుండా పక్కకు వెళ్లేలా చేశారు. పనులు నాసిరకంగా చేసి రూ.కోటికిపైగా బిల్లులు చేసుకున్నారు. తర్వాత బిల్లులు రాలేదని పనులు పూర్తి చేయకుండా అర్ధాంతరంగా ఆపేశారు. పనులు పూర్తి చేయాలని గ్రామ పెద్దలు అప్పట్లోనే కాంట్రాక్టర్‌ను బతిమాలినా ఆయన పట్టించులేదు. కాంట్రాక్టర్ సాంబశివారెడ్డికి సమీప బంధువు కావడంతో చేసిన పనులకంటే ఎక్కువగానే బిల్లులు మంజూరు చేయించుకున్నట్లు సమాచారం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి మిగిలిన నిధులతో అండర్ డ్రైనేజ్ పనులు పూర్తి చేసి గ్రామంలో మురుగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అప్పటి శిలా ఫలకం ←

మిగులు నిధులు లేవు



శింగనమలలో 2022లో అండర్ డ్రైనేజీ పనులు చేపట్టారు. ఈపనులకు సంబంధించి మిగులు నిధులు ఉన్నట్లు మా కార్యాలయంలో ఎలాంటి రికార్డులు లేవు. ఈపనులకు సంబంధించి మొత్తం నిధులు బిల్లులు అయినట్లు తెలుస్తోంది. పై అధికారుల నుంచి నిధులు ఉన్నట్లు సమాచారం వస్తే మిగిలిన పనులు పూర్తి చేయిస్తాం.

- రవీంద్రనాథ్ రెడ్డి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్



సగం వరకు కట్టి నిలిపేసిన డ్రైనేజీ కాలువ

దుర్వాసనతో ఇబ్బంది



శింగనమల బస్టాండ్‌లో హోటల్ పెట్టుకుని జీవనోపాధి పొందుతు న్నా. మా ఊరిలో ఇష్టారాజ్యంగా డ్రైనేజీ కాలువలు నిర్మించారు. పైనుంచి వచ్చే మురుగు నీరంతా కాలువలోకి పోకుండా మా హోటల్ వద్దకు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో టీ, కాఫీ, టిఫిన్‌కు వచ్చే కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాను రాను రావడం మానేస్తున్నారు. ఈక్రమంలో నాకు నష్టాలు తప్పడం లేదు. డ్రైనేజీ కాలువల పనులు నాసిరంగా చేయడంతోనే మురుగు నీరు కిందికి పోవడం లేదు.

- ఈడిగ శంకర్‌గౌడ్

కంపు భరించలేక..



ఊరికి చివరలో మా ఇళ్లు ఉంది. మురుగు నీరంతా మా ఇంటి వద్దకు వచ్చి చేరుతోంది. మా ఇంటి వద్ద నుంచి పోయే డ్రైనేజీ కాలువలు ఎక్కడికక్కడ బ్లాక్ కావడంతో మురుగునీరు అక్కడే నిల్వ ఉంటోంది. దీంతో భరించలేని దుర్గంధం వస్తోంది. కంపు భరించలేక ఎన్నోమార్లు అధికారులకు ఫిర్యాదు చేశాము. అయినా వారు పట్టించుకోకపోవడంతో సొంతింటిని ఇంటిని వదిలేసి గ్రామంలో మరో అద్దె ఇంటికి చేరాము.

- దాసరి వెంకటనారాయణ(జడేజా)

బొమ్మల పండుగ

- జిల్లాలో పెరుగుతున్న బొమ్మలకొలువు సంప్రదాయం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రంగు రంగుల బొమ్మలు. అందులో వివిధ రూపాల్లోని దేవతలు, మనుషులు, పశుపక్ష్యాదుల బొమ్మలను అందంగా, ఓ క్రమపద్ధతిలో కొలువుదీర్చి చేసుకునే పండుగ బొమ్మల కొలువు. ప్రతి ఏటా దసరా పండుగ సందర్భంగా బొమ్మల కొలువు నిర్వహించడం తరాలుగా వస్తున్న సంప్రదాయం. కాలానుగుణమైన మార్పుల్లో భాగంగా ఈ బొమ్మల కొలువులు ఏర్పాటు చేయడానికి కాస్త గ్యాప్ వచ్చినా ఇటీవల ఈ కార్యక్రమాలు పలుచోట్ల ఊపందుకున్నాయి. అపార్ట్‌మెంట్ కల్చర్‌లోనూ ఇవి సామాజిక వేడుకల్లా మారాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బొమ్మల కొలువులను ఏర్పాటు చేసి నవరాత్రులను శోభాయమానంగా జరుపుకుంటున్నారు.



బొమ్మల కొలువును చూపుతున్న మల్లిక కుటుంబం



40 వేల బొమ్మలతో...

నగరంలోని ఆర్‌కే నగర్‌కు చెందిన కెనరాబ్యాంకు విశ్రాంత ఉద్యోగి కమలాకర్, మల్లిక దంపతులు ప్రతి ఏటా బొమ్మల కొలువును వారి నివాసంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ 40వేలకు పైగా బొమ్మలను సేకరించారు. ప్రతి ఏటా దసరా నవరాత్రుల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి, దాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల వారిని ఆహ్వానిస్తున్నారు. వీరి సంప్రదాయాన్ని కుమారుడు నీలమేఘశ్యామ్, తేజశ్విని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేకించి శ్రీకృష్ణలీలలు, మహాబలిపురం, సంపూర్ణ రామాయణం, టీటీడీ బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవ, మయాబజార్ ఘటోత్కచుడి విందు, కంచి కామాక్షి ఊరేగింపు వంటి ఘట్టాలను బొమ్మలద్వారా కొలువుదీర్చారు. ఈసారి దసరా నవరాత్రుల్లో భాగంగా శివకోటి దేవాలయం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, రెండోరోడ్డులోని శ్రీ జ్ఞాన పీఠంలోనూ ప్రత్యేకంగా బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు.



రూ.రెండు లక్షలకు పైగా వెచ్చించాం



ప్రతిఏటా బొమ్మలకొలువు ఏర్పాటు చేయడం మా ఇంటి సంప్రదాయం. ప్రతి ఏడాది కొత్త కొత్త బొమ్మలను ఉంచుతాం. ఇందుకోసమే ప్రత్యేకంగా ఇతర ప్రాంతాలకు విహారయాత్రలా వెళ్లి బొమ్మలను కొనుగోలు చేస్తాం. ఇప్పటివరకూ చెన్నై, బెంగళూరు, తంజావూరు, కొండపల్లి, హైదరాబాద్, అహ్మదాబాద్ ఇలా రకరకాల ప్రాంతాలనుంచి బొమ్మలు తీసుకొచ్చాం. ఇప్పటివరకూ రూ.2లక్షలకు పైగా బొమ్మల కోసమే ఖర్చు చేశాం. నవరాత్రుల్లో ప్రతిరోజూ స్థానిక మహిళలను ఇంటికి పిలిచి పేరంటాలు నిర్వహిస్తుంటాం. ఏడాదికేడాది మా ఇంటికి వచ్చి బొమ్మలకొలువును తిలకించేవారు పెరుగుతున్నారు.

- మల్లిక, బొమ్మలకొలువు నిర్వాహకురాలు



బొమ్మల కొలువులోని ఓ ఘట్టం

గుమ్మఘట్ట ఎంఈఓ-2కు షోకాజ్ నోటీసు

అనంతపురం విద్య, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట ఎంఈఓ-2 రామచంద్రకు ఆర్జేడీ శామ్యూల్ శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అర్హత లేకున్నా తన భార్యకు అసిస్టెంట్ ఐఈడీ పోస్టు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని, పత్రికలు, సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ ఫిర్యాదు చేయడంతో ఆయనను ఆర్జేడీ వివరణ కోరారు. ఏపీసీ శైలజను వేధిస్తున్నారని, విధులకు సరిగా వెళ్లడంలేదని ఆధారాలతో లీప్ యాప్‌లో ఫిర్యాదులు వచ్చినట్లు షోకాజ్ నోటీసులలో పేర్కొన్నారు. వీటిపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ పేర్కొన్నారు. షోకాజ్ నోటీసులు వచ్చిన విషయాన్ని ఎంఈఓ-2 రామచంద్ర ధ్రువీకరించారు. ఈ వ్యవహారం విద్యాశాఖ వర్గాలలో తీవ్ర దుమారం రేపుతోంది.

పీజీలో 213 మంది చేరిక

అనంతపురం రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మొదటి విడత పీజీ అడ్మిషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. మూడు రోజుల క్రితం అడ్మిషన్‌ల ప్రక్రియ చేపట్టారు. రెగ్యులర్ 207 సీట్లు, సెల్ఫ్ ఫైనాన్స్ కింద 61 సీట్లు, పేమెంట్ సీట్లు 60 కలిపి 328 సీట్లు వర్సిటీకి కేటాయించారు. ఇందులో 213 భర్తీ అయ్యాయి. మరో 115 భర్తీ కావాల్సి ఉంది. తొలివిడత కెమిస్ట్రీలో 29 మంది, అప్లైయిడ్ మ్యాథమ్యాటిక్స్‌లో ముగ్గురు, మ్యాథమ్యాటిక్స్ ఐదుగురు, బయోకెమిస్ట్రీ 11 మంది, బయో టెక్నాలజీ 12 మంది, బాటనీ 9 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ నలుగురు, జాగ్రఫీ ముగ్గురు, మైక్రో బయాలజీ 12 మంది, ఫిజిక్స్‌లో ఆరుగురు, పాలిమర్ సైన్స్‌లో ఒక్కరు, సెరికల్చర్‌లో ఆరుగురు, స్టాటిస్టిక్స్ నలుగురు, జువాలజీలో 12 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఐదుగురు, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 15మంది, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 19 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఒకరు అడ్మిషన్ పొందారు. మొదటి విడతలో ఎక్కువగా సైన్స్ సీట్లు భర్తీ అయ్యాయి. సైన్స్‌లో 157 మంది, ఆర్ట్స్‌లో 56 మంది చేరారు. రెండో విడత అడ్మిషన్‌లు అక్టోబరు మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

కూలిన మృత్యువు..!

- ఇంటి ఎలివేషన్ కూలి వ్యక్తి దుర్మరణం



ఎలివేషన్ కూలడంతో ద్విచక్రవాహనంపైనే మృతి చెందిన వెంకటరాముడు

గుంతకల్లు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా..! మార్కెట్‌కు వెళ్లి దుకాణంలోకి అవసరమైన కాయగూరలు తెస్తా' అని తల్లికి చెప్పి బయటకు వెళ్లిన వెంకటరాముడు (59) తిరిగి ఇంటికి రాకుండానే మృత్యు ఒడికి చేరిన ఘటన గుంతకల్లులో శనివారం జరిగింది. గుంతకల్లులోని ఏకలవ్యనగర్‌కు చెందిన వెంకటరాముడు కిరాణా అంగడిని నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలోనే అంగడికి అవసరమైన సరుకుల కోసం మార్కెట్‌కు తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అక్కడ అవసరమైన కాయగూరలు కొని వాహనంపై పెట్టుకుని 11:45 సమయంలో ఇంటికి బయల్దేరాడు. ఇది ఇలా ఉండగా మార్కెట్ సమీపంలో ఉన్న పాత భవనాన్ని కూల్చడానికి ఇంటి యజమాని కూలీలతో పైకప్పును పాక్షికంగా తొలగించాడు. అయితే భవనం వర్షానికి నానడం, పైకప్పునకు సపోర్టు లేకపోవడంతో ఇంటి ముందుభాగం (ఎలివేషన్) హఠాత్తుగా కూలింది. ఇదే సమయంలో ద్విచక్రవాహనంపై కూరగాయల సంచులతో అటు వెళ్తున్న వెంకటరాముడిపై పడింది. ఎలివేషన్‌లోని బరువైన సిమెంటు పెల్లలు పడటంతో వెంకటరాముడి తల, ముఖం ఛిద్రమైపోయాయి. ఎలివేషన్ బరువుకు ద్విచక్ర వాహనంపై కూర్చున్న వ్యక్తి కూర్చున్నట్లుగానే మృతిచెందాడు. పోలీసుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న తల్లి, భార్య, కుమారుడు, బంధువులు బోరున విలపించారు. 'సంతకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరి వచ్చి, కనీసం ముఖం చూడటానికి కూడా వీల్లేని విధంగా మమ్మల్ని విడిచిపోయావా' అంటూ బోరున విలపించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హనుమద్వాహనంపై శ్రీవారు

అలరించిన 'శ్రీనివాస కళ్యాణం'

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం శ్రీనివాసుడు హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చనలు, తోమాలసేవలు, అలంకారసేవలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నవగ్రహ, దీక్షాహోమాలను నిర్వహించారు. సాయంత్రం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన హనుమద్వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలోని వేదికపై కళాకారులు ప్రదర్శించిన శ్రీనివాస కళ్యాణం నృత్యరూపకం ఎంతగానో అకట్టుకుంది.



హనుమద్వాహనంపై దేవదేవుడు



శ్రీనివాస కల్యాణం.. నృత్య రూపకం



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

జీఎస్టీ లబ్ధిపై అవగాహన కల్పించండి

- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. జేసీ శివనారాయణ శర్మ, పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ భాస్కర్ వల్లి, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజునాయుడు, డ్వామా పీడీ సలీం బాషా, వివిధ శాఖల అధికారులతో తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలు ప్రజలకు ఎంత మేర లాభం చేకూరుస్తున్నాయో తెలియజేసేందుకు అక్టోబరు 19 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. జీఎస్టీ క్యాంపెయిన్‌కు జిల్లా నోడల్ అధికారిగా జేసీ ఉంటారని, మండల, మున్సిపల్ స్థాయిలో ఇతర శాఖల అధికారులతో కమర్షియల్ టాక్స్ అధికారులు సమన్వయం చేసుకుని అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయంపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కూడా జీఎస్టీ గురించి తెలియజేయాలని అన్నారు.

వైసీపీ డిజిటల్ బుక్ ప్రారంభం



డిజిటల్ బుక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైసీపీ నాయకులు


అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఆయన డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని విమర్శించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ హయాంలో పనిచేసిన అధికారులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులపై భవిష్యత్తులో చర్యలు ఖాయమని హెచ్చరించారు. ఎవరికి అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. బాధితులు డీటీడబ్ల్యుఈవైఎస్ఆర్‌సీపీ.కామ్ అనే వెబ్‌సైట్‌లో ఫిర్యాదులను నమోదు చేయవచ్చని తెలిపారు. 040-49171718 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నియోజకవర్గ కేంద్రాల్లో, 29న మండల స్థాయిలో డిజిటల్ బుక్ ఓపెన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌లో బాలకృష్ణ పేరు

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఓ ఉన్మాది అని, అతడికి మతిస్థిమితం లేదని అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మాజీ సీఎం జగన్‌పై అసెంబ్లీ వేదికగా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. బాలకృష్ణ పేరు ఇప్పటికే డిజిటల్ బుక్‌లో నమోదైందని అన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించలేదని అన్నారు.

ఇనుప ఖనిజం చోరీపై విచారణ

'కాలవ' వినతికి మంత్రి కొల్లు రవీంద్ర హామీ



అసెంబ్లీలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజక వర్గంలోని ఓబుళాపురం గనుల్లో ఇనుప ఖనిజం చోరీపై విచారణ జరిపిస్తామని గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్ర శాసనసభలో శనివారం తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 2019-24 మధ్యకాలంలో ఓబుళాపురం గనుల నుంచి సుమారు లక్ష టన్నుల ఇనుప ఖనిజాన్ని వైసీపీ నాయకులు అక్రమంగా తరలించినట్లు ఆరోపణలున్నాయన్నారు. వాటి విలువ రూ.30 కోట్ల మేర ఉంటుందని పత్రికల్లో వార్తలొచ్చాయ న్నారు. ఈ విషయంలో నిజానిజాలు వెలికితీయడానికి సమగ్ర విచారణ అవసరమని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కొందరు సీబీఐ సీజ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగా... రెండుసార్లు పోలీసులు పట్టుకొని కేసులు నమోదు చేశారన్నారు. గతంలో ఓఎంసీకి వాహనాలు సరఫరా చేసిన వ్యక్తే ఈ చర్యలకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారన్నారు. ఇనుప ఖనిజం దోపిడీదారులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషులను తప్పక శిక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠను దెబ్బతీసేలా దుష్ప్రచారం సాగిస్తున్న వారి వివరాలు తన వద్ద ఉన్నాయన్నారు. భిన్న రాజకీయ పార్టీల నాయకుల సోషల్‌మీడియా దుష్ప్రచారాన్ని ఆధారాలతో ఆయన మంత్రికి వివరించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ... ఇనుప ఖనిజం చోరీపై సమగ్ర విచారణ చేయిస్తామని సభలో హామీ ఇచ్చారు.

మూడేళ్ల కిందటే అక్రమ రవాణా: డీఎఫ్‌ఓ



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

రాయదుర్గం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కొండల్లో సీబీఐ సీజ్ చేసిన ఇనుప ముడిఖనిజాన్ని మూడేళ్ల కిందటే అక్రమ రవాణా చేసినట్లు గుర్తించామని డీఎఫ్‌ఓ చక్రపాణి స్పష్టం చేశారు. రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, డిప్యూటీ రేంజ్ అధికారి దామోదర్‌రెడ్డితో కలిసి ఆయన మైనింగ్ కొండల్లో శనివారం పర్యటించారు. బళ్లారి రిజర్వ్ ఫారెస్ట్ అటు కర్ణాటక ఇటు ఆంధ్ర సరిహద్దుల్లో ఉంటుందన్నారు. ఈ ప్రాంతాన్ని వివాదాస్పద ప్రాంతంగా 15 ఏళ్లకు ప్రకటించి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. 2009లో సీబీఐ సీజ్ చేసిన ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై పరిశీలించామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎలాంటి అక్రమ రవాణా జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల రెండు టిప్పర్లు అక్రమంగా ఖనిజాన్ని తరలించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా సీబీఐ సీజ్ చేసిన ముడిఖనిజం ఎవరికి అప్పగించారన్న విషయం తేలాల్సి ఉందన్నారు.

టమోటా కిలో రూ.19

అనంతపురంరూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం టమోటా కిలో రూ.19తో విక్రయాలు జరిగినట్లు రాప్తాడు మార్కెట్ కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.14తో అమ్మకాలు జరిగాయన్నారు. మార్కెట్ మొత్తంగా 3వేల టన్నుల కాయలు వచ్చాయని పేర్కొన్నారు.

సిలిండర్ డెలివరీలో అవకతవకలు

రూ.10వేలు జరిమానా విధించిన తూనికలు, కొలతల శాఖ అధికారులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్యాస్ వినియోగదారుల ఫిర్యాదులతో తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు చేశారు. డెలివరీ వాహనంలో తూకం వేసే మిషన్ లేకపోవడంతో పాటు గ్యాస్ సరఫరా ధ్రువీకరణ పత్రం చూపించేలేక గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యం బయటపడింది. దీంతో ఇన్‌స్పెక్టర్ శంకర్ రూ.10 వేలు జరిమాన విధించారు. సిలిండర్ ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నట్లు స్థానికులు అయన దృష్టికి తీసుకొచ్చారు. మరోసారి తూకం లేకుండా సిలిండర్లు డెలివరీ చేస్తే ఏజెన్సీ రద్దుకు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న పురోహితులు

రాప్తాడు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త పల్లి గ్రామంలో శనివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించి కల్యాణాన్ని జరిపించారు. గ్రామస్థులతో పాటూ చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

జేఎన్‌టీయూలో ఆయుధ పూజ



ఆయుధ పూజలో పాల్గొన్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, హాజరయ్యారు. దుర్గా మాతకు పూజ చేశారు. దుర్గామాత ప్రాముఖ్యత, ఆయుధ పూజ ఆవశ్యకతను వివరించారు. డైరెక్టర్లు, కళాశాల సీనియర్ ఆచార్యులు, హెచ్‌ఓడీలు, డీఆర్‌లు, ఏఆర్‌లు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ఆత్మకూరు సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు కొండపై ఉన్న మలోబుల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మోహన్, ప్రవీణ ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. ఆలయ ఈఓ దేవదాస్, ఆలయ మాజీ ఛైర్మన్ శ్రీరామిరెడ్డి, నాయకులు రాజారమేష్, నారాయణ, ఓబులప్ప, నాగన్న, పోతన్న, గోపాల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును నిలిపివేసిన అంగన్‌వాడీలు



అర గంటపాటు బస్సుని నిలిపిన మహిళలు

శింగనమల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గకేంద్రంలో ఆర్టీసీ బస్సులో ఎక్కేందుకు వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలను డ్రైవర్, కండెక్టర్ బస్సు నిండిపోయిందని అడ్డుకోవడంతో కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు బస్సులో సొంతూళ్లకు వెళ్లేందుకు బస్టాండుకు వచ్చారు. అయితే అప్పటికే బస్సు నిండిపోవడంతో డ్రైవర్, కండెక్టర్లు వారిని ఎక్కించుకునేందుకు నిరాకరించారు. తమను ఎక్కించుకునే వరకు బస్సు కదలనివ్వమని 20 మంది కార్యకర్తలు భీష్మించారు. డ్రైవర్, కండక్టర్లతో వాగ్వాదానికి దిగారు. అరగంటపాటు బస్సును కదలనివ్వలేదు. ఇంతలో అక్కడున్న కొంత మంది వచ్చి అందరూ సర్దుకోవాలని కోరడంతో కార్యకర్తలు బస్సు ఎక్కారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కనగానపల్లి, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని భానుకోట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకూ రాజస్థాన్ రాష్ట్రం జాలోరు జిల్లా బోర్తా గ్రామానికి చెందిన రతారామ్ ప్లే ఉడ్ షాపు నిర్వహిస్తూ ధర్మవరంలో స్థిరపడ్డాడు. ఉడ్ వర్క్ పనిమీద ద్విచక్ర వాహనంలో కళ్యాణదుర్గం వెళుతుండగా భానుకోట గ్రామం వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ దాటే ప్రయత్నంలో అదుపుతప్పి పక్కనున్న బండరాయిని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆయన అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రతారామ్‌కు భార్య హయాదేవితో పాటు ఇద్దరు పిల్లలున్నారు. కనగానపల్లి పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

పాటు కాటుతో..

శింగనమల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్న జలాలపురం గ్రామానికి చెందిన జింకల కొండయ్య(55) పాము కాటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు కొండయ్య కట్టెలు కొట్టుకుని వాటిని అమ్మి జీవనం సాగించేవాడు. శనివారం సాయంత్రం కట్టెలు కొడుతుండగా పాము కాటు వేసింది. స్థానికులు గమనించి అనంతపురం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కొడయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంటెయినర్‌ను ఢీకొన్న కియ బస్సు

● అందరూ సురక్షితం

కనగానపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదులూరు 44వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన మేరకూ పెనుకొండ వద్ద కియలో పనిచేస్తున్న సిబ్బందిని ఎక్కించుకున్న బస్సు అనంతపురం వెళుతోంది. దాదులూరు వద్దకు రాగానే ముందు వెళుతున్న కంటెయినర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో బస్సు కంటెయినర్‌ను ఢీకొంది. దీంతో రెండు వాహనాలు డివైడర్‌ను ఢీకొని ఆగాయి. ఈ ప్రమాదంతో బస్సులో ఉన్న 25 మంది కియ సిబ్బంది ఉలిక్కపడ్డారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారీగా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌జామ్ కావడంతో పోలీసులు అక్కడికి చేరుకుని క్లియర్ చేశారు.

తల్లీకూతుళ్ల ఆచూకీ లభ్యం

రాప్తాడు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపర్తికి చెందిన సాకే పోతులయ్య భార్య పద్మలత తన ఇద్దరు కూతుళ్లతో ఇంట్లో చెప్పకుండా 22న ఇంటినుంచి వెళ్లిపోయింది. వారు కనిపించకపోవడంతో భర్త రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పద్మలత బళ్లారిలో ఉన్న తన అమ్మ దగ్గరకు వెళ్లాలని వెళ్లగా బళ్లారికి వెళ్లగానే ఫోన్ స్విచ్ఆఫ్ కావడంతో ఇంటి వద్దకు వెళ్లలేక బళ్లారిలో ఓ ఆలయం వద్ద ఉంది. సమాచారం మేరకు ఆచూకీ తెలవడంతో కుటుంబ సభ్యులు రాప్తాడు పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకుని వచ్చి పోలీసుల సమక్షంలో భర్తకు అప్పచెప్పారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సమీపంలోని తాటిచెర్ల-అనంతపురం రైల్వే స్టేషన్ మధ్యలో 60 సంవత్సరాల వృద్ధుడు శనివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.



మొదటిరోడ్డు శివాలయంలో శేషవాహనంపై నారసింహాదేవి అలంకారం



పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో గాయత్రీదేవి అలంకారం



హెచ్చెల్సీ కాలనీలో లలితా త్రిపుర సుందరి అలంకారంలో కొల్హాపూర్ మహాలక్ష్మి

కరుణించగ రావమ్మా కల్పవల్లీ..!

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజు శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. జిల్లా కేంద్రంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్ల మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తూరు వాసవీ ఆలయంలో అమ్మవారికి నవధాన్యాలతో అలంకరించారు.పాతూరు వాసవీమాతకు కరెన్సీనోట్లతో ధనలక్ష్మిగా అలకించారు. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో అమ్మవారిని శేషవాహనంపై నారసింహాదేవిగా అలంకరించారు. రామచంద్రనగర్ షిర్డిసాయి ఆలయంలో లలితా త్రిపురసుందరీ దేవి అలంకరించారు.



పాతూరు అమ్మవారిశాలలో ధనలక్ష్మి వాసవీమాత మూలవిరాట్



కొత్తూరు అమ్మవారిశాలలో వాసవీమాతకు నవధాన్యాలతో అలంకరణ

నిధులు కేటాయించండి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

శింగనమల సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. శనివారం విజయవాడలో ఎమ్మెల్యే సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి మిడ్‌పెన్నార్ ఆధునికీకరణ, జల్‌జీవన్ మిషన్‌ను పునరుద్ధరించి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కష్టపడే గుణాన్ని అలవర్చుకోవాలి: కమిషనర్



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ బాలస్వామి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడే గుణాన్ని అలవర్చుకోవాలని నగర మున్సిపల్ కమిషనర్ బాలస్వామి సూచించారు. శనివారం మండలంలోని పీవీకేకేఐటీ డిప్లమో కళాశాలలో ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. కమిషనర్‌తో పాటు డీఎస్పీ వెంకటేశులు, శ్రీబాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె కిశోర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వీరే మన నిజమైన హీరోలని అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తామని ఛైర్మన్ పల్లె కిశోర్ అన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డిప్లొమో కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్, పీవీకేకేఐటీ ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఐటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దాన, ఏఓ మనోహరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ముగిసిన శిక్షణ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందికి ఇచ్చిన శిక్షణ ముగిసింది. 25వ తేదీ నుంచి మూడు రోజులపాటు స్థానిక ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యాలయంలో అనంత జిల్లాతోపాటు ఇతర జిల్లాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. శనివారం ముగింపు కార్యక్రమంలో పప్పుశనగతోపాటు ఆవాలు, నువ్వులు, కంది, ఆముదం, అనుములు, వంగ పంటలతో ఏడాది పొడవునా పంటలు సాగు చేసే ఏ-గ్రేడ్ విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన సిబ్బందికి డీపీఎం లక్ష్మానాయక్ సర్టిఫికెట్లు అందజేశారు.

స్వచ్ఛంద సేవకులకు సన్మానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవకులకు అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ జేఎల్ మురళీధర్ సన్మానించారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శ్రీలలితా త్రిపురసుందరీదేవి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. స్థానిక సుభాష్‌రోడ్డులో శ్రీకృష్ణదేవ రాయభవన్‌లో అర్బన్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైస్ ఛైర్మన్లు మాగిశెట్టి చంద్రశేఖర్, వడ్డే మణి, పాలకవర్గ సభ్యులు గోల్డ్ బాషా, కృష్ణకుమార్, చింతా భాస్కర్, అనీల్‌నాయుడు, రొళ్ల భాస్కర్ పాల్గొన్నారు.



స్వచ్ఛంద సేవకులకు సన్మానం చేస్తున్న జేఎల్ మురళి

ఐడబ్ల్యూఎంపీ పనులు పూర్తి చేయండి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిల్లో ఐడబ్ల్యూఎంపీ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ డైరెక్టర్ వైవీ శణ్ముఖ్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక డ్వామా పీడీ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో పీడీ సలీం బాషా, ఏపీడీ చైతన్యకృష్ణలతో కలిసి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లాలో పనులపురోగతిపై ఆరా తీశారు. నవంబరు నెలాఖరులోగా పనులు పూర్తి చేసేలా ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు.

ఉపాధి పనుల పరిశీలన

ఆత్మకూరు సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధానులను శనివారం ట్రైనీ కలెక్టర్ సచిన్ రహర్ పరిశీలించారు. గోకులం షెడ్లు, పండ్లమొక్కలు పెంపకం, పశువుల నీటి తొట్టెలను పరిశీలించారు. వాటికి అయిన ఖర్చు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పీడీ సలీమ్ బాషా, ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, ఏపీఓ వెంకటనారాయణ, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మై భారత్ సెలెక్షన్ కమిటీ సభ్యుడిగా అశోక్‌రెడ్డి



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ క్రీడా యువజన వ్యవహారాల శాఖ పరిధిలోని మై భారత్ జిల్లా సెలెక్షన్ కమిటీ సభ్యుడిగా అశోక్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మై భారత్ నేషనల్ డిప్యూటీ డైరెక్టర్ దేవేంద్ర వ్యాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనమీద నమ్మకంతో సభ్యుడిగా అవకాశం కల్పించడం పట్ల కేంద్రప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వైద్యం చేయడం రాదా?

అమ్మ ఆస్పత్రి నిర్వహణపై డీఎంహెచ్ఓ ఆగ్రహం



అమ్మ హాస్పిటల్ నిర్వాహకులు, డాక్టర్లను ప్రశ్నిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎనిమిది నెలలుగా మీపర్యవేక్షణలో వైద్యసేవలు పొందుతున్న గర్భిణికి ఎలాంటి అనారోగ్య సమస్యలున్నాయో గుర్తించకపోతే ఎలా? వైద్యం చేయడం రాదా? అలాంటప్పుడు ఆస్పత్రి ఎందుకు పెట్టాలి అంటూ అమ్మ హాస్పిటల్ డాక్టర్‌పై డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం డెమో త్యాగరాజు, గంగాధర్‌లను వెంటపెట్టుకుని ఆమె అమ్మహాస్పిటల్‌కు వెళ్లారు. ప్రభుత్వ నిబంధనల మేరకు హాస్పిటల్ నిర్వహణ సాగుతోందా? లేదా? అని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నగరంలోని ఐదో రోడ్డుకు చెందిన శిరీష గర్భం దాల్చిన నెలనుంచి ఈ ఆస్పత్రికి వచ్చి గైనకాలజిస్ట్ శివజ్యోతితో వైద్యచికిత్సలు పొందుతోందన్నారు. ఇందులో భాగంగా ప్రసవం కోసం 20న శిరీషను అడ్మిషన్ పెట్టుకున్నారన్నారు. శిరీషకు సిజేరియన్‌చేసి కాన్పుచేసిందన్నారు. మగబిడ్డ అనారోగ్యంతో ఉన్నాడని సాయినగర్‌లోని హృదయ చిన్నపిల్లల ఆస్పత్రికి శివజ్యోతి రెఫర్ చేసిందన్నారు. అక్కడ పరీక్షలుచేసినా శిశువు ఆరోగ్యంలో మార్పులేదన్నారు. హృదయ చిన్నపిల్లల ఆస్పత్రి డాక్టర్ మళ్లీ 24న ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎస్ఎన్‌సీయూకి రెఫర్‌చేశారన్నారు. చివరికి 25న శిశువు మృతిచెందాడన్నారు. బాధితులు అమ్మ హాస్పిటల్ నిర్వాహకులపై ఆగ్రహాన్ని వ్యక్తంచేసి ఆందోళన చేశారన్నారు. శిరీషకు జన్మనించిన మగశిశువు మృతి విషయాన్ని అమ్మ హాస్పిటల్‌గాని, హృదయ చిన్నపిల్లల ఆస్పత్రి నిర్వాహకులుగాని ప్రభుత్వానికి సమాచారమివ్వలేదన్నారు. హాస్పిటల్‌లో నర్సింగ్ స్టాఫ్ పనిచేస్తున్నా ఆ వివరాలను డీఎంహెచ్ఓ కార్యాలయానికి పంపలేదన్నారు. నిబంధనల మేరకు సిబ్బందిని నియమించలేదన్నారు. ఇలా అనేక లోపాలున్నాయని, అసలేం జరిగిందో వివరాలు సేకరించామని, కలెక్టర్ ఆనంద్‌కు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు నివేదికలు పంపుతామన్నారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలి: ఈఎన్‌సీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపంచాలి. ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా, మార్పు లేదంటే యాక్షన్ తప్పదని ఈఎన్‌సీ (ఇంజనీర్ ఇన్ చీఫ్) బాలు నాయక్ పంచాయితీరాజ్ ఇంజనీర్లను హెచ్చరించారు. శనివారం అనంతపురం పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలుకు చెందిన ఎస్ఈ, ఈఈ, డీఈలతో సమావేశం నిర్వహించారు. రెండు జిల్లాల్లోనూ ఎక్కువగా పీఐయూకు సంబంధించిన వర్కులు పురోగతి లేకపోవడంతో దానిపైనే సమీక్ష నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పురోగతికి సంబంధించి డీఈలు సమాధానం చెప్పడానికి నీళ్లు నమిలారు. దీంతో తీవ్రస్థాయిలో క్లాస్ పీకారు. మీకు కవాల్సినవన్ని సమకూరుస్తున్నాం, పురోగతి చూపించడానికి ఇబ్బంది ఏమిటని మందలించారు. కర్నూలు ఎస్ఈ వేణుగోపాల్, ఈఈలు ప్రభాకర్‌రెడ్డి, శంకరయ్య, శ్రీరాములు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జున మూర్తి, కర్నూలు ఈఈ రఘురామిరెడ్డి, నంద్యాల ఈఈ నాగరాజు, డీఈలు రాజేంద్రప్రసాద్, గురుమూర్తి, లక్ష్మీనారాయణ, క్రిష్ణజ్యోతి, మురళీధర్, లోకన్న, రవీంద్ర, నారాయణస్వామి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

పీఐయూ పనుల తనిఖీ: జిల్లా పర్యటనకు వచ్చిన పంచాయితీరాజ్ ఈఎన్‌సీ బాలు నాయక్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షను పూర్తి చేసుకొని జిల్లాలోని పలు ప్రాంతాల్లో పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్) ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. పీఎంజీఎస్‌పై కింద చిత్తూరు నుంచి పామిడి మీదుగా పెద్దవడుగూరు వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. ఈఈ శ్రీరాములుతో వివరా లు అడిగి తెలుసుకున్నారు. ఈఈ ప్రభాకర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జునమూర్తి, డీఈ పాండు రంగారెడ్డితో పాటు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఎన్‌సీ బాలు నాయక్

మహిళలు, చిన్నారుల భద్రతకు కృషి

● ఎమ్మెల్యే పరిటాల సునీత



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారుల భద్రతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం అసెంబ్లీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి ఛైర్మన్ మోషన్ రాజు ఆధ్వర్యంలో అసెంబ్లీ కమిటీ సమావేశం నిర్వహించగా మహిళ, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ కమిటీ సభ్యుల హోదాలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కమిటీల సభ్యులు జిల్లాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని చర్చించి, పరిష్కార మార్గాలు చూపాలని స్పీకర్, ఛైర్మన్ సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చట్టసభలకు ఈ కమిటీ ఎంతో కీలకంగా మారుతున్నాయని వివరించారు. క్షేత్రస్థాయిలో అక్కడక్కడా మహిళలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కమిటీ దృష్టికి తీసుకొస్తామన్నారు.

రాష్ట్ర ప్రజలపై కనకదుర్గమ్మ ఆశీస్సులుండాలి

బెజవాడ కనకదుర్గమ్మ ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారి దర్శనానికి ఎమ్మెల్యే వెళ్లారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. 6వ రోజు లలితా త్రిపురసుందరి అలంకరణలో ఉన్న అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో శరన్నవరాత్రుల వేళ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

మైనార్టీ సంక్షేమానికి కట్టుబడ్డాం

: ఎమ్మెల్యే దగ్గుపాటి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశ మందిరంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి ఛైర్మన్ మోషన్‌రాజు అసెంబ్లీ కమిటీల సమావేశం నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ నజీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే హాజరయ్యారు. స్పీకర్, ఛైర్మన్ కమిటీ సభ్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీ జనాభా ఎక్కువగా ఉందన్నారు. చాలా మంది నిరుపేదలున్నారని, ఉపాధి లేక ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. ఇలాంటి వారికి రుణాలు, ఇతర ఆర్థిక తోడ్పాటు అందించి చేయూతనందించాల్సిన అవసరం ఉందని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు.

దుర్గమ్మ ఆశీస్సులతో అభివృద్ధి వైపు ఏపీ

దుర్గమ్మ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడిపిస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. శరన్నవరాత్రులను పురస్కరించుకుని శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్‌తో కలసి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ పురోహితులు, అధికారులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని వారు దర్శనం చేసుకున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

దూర్యవిద్య పరీక్షలో అదే వరుస..!

● మార్పులు లేకుండానే నిర్వహణ

అనంతపురంరూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న దూర్య విద్య పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పులు కనిపించలేదు. శనివారం రెండో రోజు కూడా పరీక్షలు యథవిధిగానే కొనసాగాయి. వర్సిటీలో దూరవిద్యలో ఇన్ సర్వీస్ టీచర్ల బీ.ఈడీ పరీక్షలు శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైయ్యాయి. తొలుత పరీక్షలకు సంబంధిత బీఈడీ కళాశాలలో నిర్వహించాలని నిర్ణయించారు. ఆ మేరకు మూడురోజుల కిందట అభ్యర్థుల హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లోనే పెట్టారు. హాల్ టిక్కెట్లలోనూ పరీక్ష సెంటర్ బీఈడీ కళాశాల అని ఉంది. అయితే ఇద్దరు అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు పరీక్ష సెంటర్‌ను పూలే భవన్‌కు మార్పు చేశారు. ఈ విషయం చాలా మందికి తెలీయని పరిస్థితి. కొందరు అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. పరీక్ష అరగంట ఆలస్యం అయిన విషయం తెలిసిందే. అంతేకాకుండా పరీక్ష గదిలో అభ్యర్థులను వరుస క్రమంలోనే కూర్చోబెట్టి పరీక్ష నిర్వహించారు. శనివారం ఇందులో ఎలాంటి మార్పు కనిపించని దుస్థితి. పరీక్ష కేంద్రాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్ పరిశీలించారు.

ఆర్టీసీ కానిస్టేబుల్ అత్యుత్సాహం

● అవుట్‌సోర్సింగ్ మెకానిక్‌లపై దుర్భాషలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం డిపోలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న కొందరు మెకానిక్‌లపై ఆర్టీసీ కానిస్టేబుల్ దుర్భాషలాడిన వైనం వివాదానికి దారితీసింది. కార్మికులు పనులు మానేసి బాయ్‌కాట్ చేయగా డీఎం చొరవతో సమస్య సద్దుమణిగింది. అనంతపురం డిపోలో పనిచేస్తున్న రాజశేఖర్, ప్రకాష్ అనే మెకానిక్‌లు శనివారం బైక్‌పై డిపోలోకి వచ్చి, డిపో ఆవరణలో పార్క్ చేసిన అనంతరం గ్యారేజీలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద ప్రసాదం తీసుకుంటున్నారు. ఆ సమయంలో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఏవీపీ నాయుడు వారిని పిలిచి బైక్‌ను 'డిపోలో ఎందుకు పెడుతున్నావ్... మీ అవుట్‌సోర్సింగ్ వాళ్లంతా..' అంటూ దుర్భాషలతో రెచ్చిపోయాడు. అవుట్ కార్మికులంతా పనులు బాయ్‌కాట్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎం నాగభూపాల్ అక్కడికి చేరుకుని కార్మికులతో చర్చించి సమస్యను పరిష్కరించారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం వద్దనున్న ఈవీఎం గోడౌన్‌ను శనివారం కలెక్టర్ ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. రాజకీయపార్టీల నాయకులు, అధికారుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు ఇతర సామగ్రిని భద్రపరచిన గదులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గోడౌన్ తనిఖీ రిజిస్టర్‌లో ఆయన సంతకం చేశారు. ఆర్డీఓ కేశవనాయుడు, డీటీ కనకరాజు, యోగేశ్వరీదేవి, టీడీపీ పవన్‌కుమార్, బీజేపీ ఈశ్వర్‌ప్రసాద్, జనసేన కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

శింగనమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనుపత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి మార్కెట్‌యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు ఆర్థిక సాయం చేశారు. షంషీర్‌వలి అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకుని రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు.

సంక్షిప్త వార్తలు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవానీ

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గతంలో పారిశుధ్యంలో గుంతకల్లు మున్సిపాలిటీ మొదటి స్థానంలో ఉండేదని, ప్రస్తుతం చివరి స్థానానికి వెళ్లిందని తక్షణమే చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్. భవాని అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు కృపాకర్, పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. పట్టణంలో ఎక్కడ చూసినా ఆవులు, కుక్కలు సంచరిస్తున్నాయన్నారు. ఆవులను గోశాలకు తరలించాలని, కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వైస్‌చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి మాట్లాడుతూ.. కమిషనర్ కౌన్సిలర్ల పట్ల ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అందరిని సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి, ఎంఈ ఇంతియాజ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర కో ఆర్డినేటర్ పుల్లారెడ్డి

గుత్తి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రైవేట్ పాఠశాలల యజమానులు కృషి చేయాలని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ పుల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన సలహాదారుడు నాగపేరయ్య, జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నాగరంగారావు, రామకృష్ణ, షెక్షావలి, వెంకటరమణ, యోగేంద్ర, ప్రసాద్, కృష్ణయ్య, విద్యాధర్, ముంతాజ్‌బేగం, కృష్ణ, వేదమూర్తి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

గుత్తి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. సాయి టెక్‌వాడో స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా మాట్లాడుతూ.. రాజులు పాలించిన గుత్తికోటను పర్యాటక కేంద్రంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, నాయకులు సుధాకర్, రాజేంద్ర, మాస్టర్ సాయి పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

గుత్తి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంగాల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడీసీఎస్ పీడీ నాగమణి, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అంజుమ్, సూపర్‌వైజర్ రాజేశ్వరి, వర్కర్లు పాల్గొన్నారు.

బిల్డింగ్ యజమానిని అరెస్ట్ చేయాలి

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూరగాయల మార్కెట్ రోడ్డులో కనీస రక్షణ చర్యలు తీసుకోకుండా దాసరి వెంకటరాముడు అనే వ్యక్తి మృతికి కారకులైన బిల్డింగ్ యజమాని, మేస్త్రీని తక్షణమే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుడి బంధువులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రంగన్న, హరిబాబు, చిన్నరాయుడు, అంజి, జయరాం పాల్గొన్నారు.

పశువులను రోడ్లపైకి వదలొద్దు

విడపనకల్లు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పశువులను రోడ్లపైకి వదిలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ శాఖ, పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో 'రోడ్డుపై పశువుల సంచారం' అనే శీర్షికన కథనం ప్రచురితమయింది. ఈ కథనానికి స్పందించిన అధికారులు శనివారం గ్రామంలోని పశువుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఎవరైనా పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్త జీఎస్టీని అమలు చేయాలి

కుందుర్పి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు కొత్త జీఎస్టీని అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వాణిజ్య పన్నుల శాఖ సహాయక కమిషనర్ శివమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జీఎస్టీ తగ్గింపుపై స్థానిక డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణ బాలాజీ, సచివాలయ సిబ్బంది తదితరులతో కలిసి అవగాహన కల్పించారు. అనంతరం పలు దుకాణాలను తనిఖీ చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వండి
- వెంగన్నపల్లి లబ్ధిదారుల నిరసన

యాడికి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వలేదని, రేషన్ ఎలా పంపిణీ చేస్తారంటూ వెంగన్నపల్లికి చెందిన పలువురు లబ్ధిదారులు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు ఇంతవరకు పంపిణీ చేయలేదన్నారు. అధికారులను అడిగితే మీకు స్మార్ట్ రేషన్ కార్డులు రాలేదని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే స్మార్ట్ కార్డులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. వెంగన్నపల్లిలో కొంత మందికి స్మార్ట్ రేషన్ కార్డులు రాలేదని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించామన్నారు. వచ్చేనెల రేషన్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద వెంగన్నపల్లి వాసుల నిరసన


తాడిపత్రిలో సూర్యకళాదేవి అలంకరణలో వాసవీమాత


బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలో 108 చీరల అలంకరణ



రాయదుర్గం కన్యకా పరమేశ్వరి ఆలయంలో వెంకటేశ్వరస్వామి, చౌడేశ్వరిదేవి ఆలయంలో లలితా త్రిపురసుందరిగా అమ్మవారు


గుత్తిలో లలిత త్రిపుర సుందరిగా మాతాజగదాంబ

లలితా త్రిపుర సుందరిగా దుర్గామాత

(న్యూస్ నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గామాత వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గుంతకల్లు పట్టణంలోని కొల్హాపూర్ మహాలక్ష్మి దేవాలయంలో లలితా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గుత్తి మండలం సేవాఘడ్‌లో లలిత త్రిపుర సుందరి దేవిగా మాతాజగదాంబను అలంకరించారు. బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలో 108 చీరల అలంకరణలో కన్యకాపరమేశ్వరి దర్శనమిచ్చారు. రాయదుర్గం పట్టణంలోని నగరేశ్వర కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రీవెంకటేశ్వరస్వామి అలంకరణలో, చౌడేశ్వరిదేవి దేవాలయంలో లలిత త్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.


పామిడిలో ధనలక్ష్మిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


గుంతకల్లులో లలితా త్రిపుర సుందరిగా కొల్హాపూర్ అమ్మవారు


ఉరవకొండలో లలితదేవి అలంకరణలో ఈశ్వరమ్మదేవి,


కమ్మూరులో లలితా త్రిపుర సుందరి అలంకరణ

ఈ-పంట నమోదును పూర్తి చేయండి : జేడీఏ


ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

రాయదుర్గంరూరల్/కణేకల్లు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పంటల నమోదును సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌ఎస్‌కే సిబ్బందిని జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శనివారం మండలంలోని ఆవులదట్ల గ్రామంలో ఈ పంట నమోదును జేడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సర్వే నంబర్‌ను, సాగుచేసిన పంటలను నమోదు చేయాలని తెలిపారు. అదే విధంగా కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాలలో జరుగుతున్న ఈ పంట నమోదును ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు అహ్మద్ బాషా, జగదీష్, సాయికుమార్, కృష్ణకిషోర్ ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు నీరు వదలండి

పెద్దపప్పూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట రిజర్వాయర్‌కు నీరు వదలాలని తహసీల్దార్ బాలాజీరాజుకు రైతులు వినతి పత్రం అందించారు. ఇటీవల హెచ్‌ఎల్‌సీ రిజర్వాయర్ ద్వారా కాలువ నీరు వస్తున్న నేపథ్యంలో ముచ్చుకోట, వరదాయపల్లి చిక్కేపల్లి అమ్మలదిన్నె కొత్తపల్లి పలు గ్రామాల రైతులు తహసీల్దార్‌ను కలిసి ముచ్చుకోట రిజర్వాయర్ వదిలితే ఐదు గ్రామాలకు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈమేరకు తహసీల్దార్ రిజర్వాయర్ ఏఈ శ్రీనివాసులుకు ఫోన్‌లో మాట్లాడి నీరు వదలాలని సూచించారు.

మాజీ సర్పంచ్ మృతి



విడపనకల్లు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్. కొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ ఓబులమ్మ (70) శనివారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ ఉండేదని, అర్ధరాత్రి తుది శ్వాశ విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ ప్రతాప్‌నాయుడుతో పాటు పలువురు నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చికిత్స పొందుతూ మహిళ..

బెళుగుప్ప, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లికి చెందిన సుజాత (45) అనే మహిళ శనివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె శుక్రవారం క్రిమిసంహారక మందుతో తాగి ఆత్మహత్యకు యత్నించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ శివశంకర నాయక్ తెలిపారు. ఆమెకు భర్త రామ్మోహన్‌రెడ్డి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జీడిపల్లికి ఇన్‌ఫ్లో 2,275 క్యూసెక్కులు

బెళుగుప్ప, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,275 క్యూసెక్కులు ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు వెల్లడించారు. ఔట్‌ఫ్లో 2,235 క్యూసెక్కులు వుండగా ప్రస్తుతం 1.705 టీఎంసీల నీటి నిల్వ వుందన్నారు. ఫేజ్-2కు 1901 క్యూసెక్కులు వెళుతుందని తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

కుందుర్పి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందుర్పి నుంచి జంబుగుంపల వరకు రోడ్డు పనులను టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ స్థానిక నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నాబార్డు నుంచి రూ. రెండు కోట్లు నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవి, హనుమంతరాయుడు, లింగయ్య పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి బాలుడి మృతికి కారణమైన డాక్టర్, నర్సులను సస్పెండ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రి వద్ద ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. డాక్టర్, నర్సుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందాడని, ఘటనపై సమగ్ర విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్లకు క్లినిక్‌ల మీద ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఆసుపత్రి మీద లేదన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ చౌదరికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, సిద్ధప్ప, వెంకటేష్ పాల్గొన్నారు. బాలుడి మృతికి కారణమైన డాక్టర్, నర్సులను సస్పెండ్ చేయాలని చాబాల గ్రామస్థులు డిమాండ్ చేశారు. రోడ్లు, భవనాల వసతి గృహంలో వారు మాట్లాడుతూ.. తీవ్ర జ్వరంతో ఆసుపత్రికి వచ్చిన బాలుడికి పరీక్షలు చేయకుండానే వైద్యం చేయడమేమిటని మండిపడ్డారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశేపల్లి సమీపంలోని ప్రధాన రహదారిలో బొలెరో వాహనం ఢీకొని ద్విచక్రవాహనంలో వెళుతున్న గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన పెద్దన్న అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దన్న వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో గుత్తికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వెనుకవైపు నుంచి బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

5 నుంచి పప్పుశనగ పంపిణీ

యాడికి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5 నుంచి విత్తన పప్పుశనగ పంపిణీ చేయనున్నట్లు ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. సబ్సిడీ పప్పుశనగ విత్తనం కోసం రైతులు అక్టోబర్ 1నుంచి సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సబ్సిడీ ధరను నిర్ణయించాల్సి ఉందని తెలిపారు.

జూదరుల అరెస్ట్

ఉరవకొండ,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని షైలారంపల్లి సమీపంలోని పేకాట స్థావరంపై పోలీసులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి, గ్రామ సమీపంలోని గుట్టలో పేకాట ఆడుతున్న 20మంది అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.77వేల నగదు, 17 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహానంది తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

రాయదుర్గం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి. వీరాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు వెంకటేశులు(51) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వెంకటేశులు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, మాజీ సర్పంచ్ సుంకప్ప, నాయకులు పాల్గొన్నారు.

కనకదాస విగ్రహావిష్కరణకు తరలిరండి

బొమ్మనహాళ్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్టోబర్ 5న నిర్వహించనున్న భక్త కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున, మండల అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లేపాక్షి, బసవరాజు, దీలిప్, కెంచప్ప పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట వర్షార్పణం

ఉరవకొండ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట తడిసిపోయింది. స్థానిక మార్కెట్ యార్డులో లత్తవరం, ఉరవకొండ గ్రామాలకు చెందిన రైతులు నూర్పిడి పంటను ఆరబోశారు. రెండ్రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో మొక్కజొన్న పంటపైన రైతులు టార్పాలిన్‌లు కప్పి, పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎడతెరపి లేకుండా కురిసిన వానకు మొక్కజొన్న పంట తడిసిపోయిందని రైతు రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు ఎకరాల్లో పంటను నూర్పిడి చేసి ఆరబెట్టగా, రెండు క్వింటాళ్లకు పైగా దెబ్బతినిందని రైతు తెలిపారు. నష్టపోయిన పంటకు పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.


టార్పాలిన్‌లపై నిల్వ ఉన్న నీటిని తోడేస్తున్న రైతులు



తడిసిపోయిన మొక్కజొన్న, కుళ్లిన గింజలను చూపుతున్న రైతు

జీఎస్టీ తగ్గింపు ప్రజలకు వరం


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లను తగ్గించడం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు, వ్యాపారులకు ఓ వరంగా భావించాలని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుపై శనివారం టీడీపీ నాయకులు మార్కెట్ వద్ద వాల్మీకి విగ్రహం వద్ద నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్స్, గార్మెంట్స్ వద్దకు వెళ్లి వ్యాపారులు, వినియోగదారులతో నారాయణస్వామి మాట్లాడారు. వినియోగదారులు మాట్లాడుతూ.. వస్తువుల ధరలు తగ్గడం గమనించామని, ఎంతో సంతోషంగా ఉన్నామన్నారు. వ్యాపారి మోహన్‌చంద్ కార్వా మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గడం వల్ల వ్యాపారాలు పెరిగాయని అన్నారు. దసరా సందర్భంగా ప్రజలకు, వ్యాపారస్థులకు జీఎస్టీ వరాన్నిచ్చిన కేంద్ర ప్రభుత్వానికి గుమ్మనూరు నారాయణస్వామి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు తలారి మస్తానప్ప, టీడీపీ నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, కౌన్సిలర్ రంగన్న, గుణ శేఖర్, ఫజులు, రామన్నచౌదరి, హనుమంతు, అంజి, వీరేశ్ కుమార్, అంజలీదేవి, కొలిమి రామాంజనేయులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బార్ నిర్వహణ

ఉరవకొండ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో అనుమతులు లేకుండా బార్ నిర్వహిస్తున్నారని గతంలో టెండర్‌లో పాల్గొన్న వారు, గ్రామస్థులు ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఉర వ కొండ పట్టణంలో గతంలో నిర్వహించిన స్థలంలోనే బార్ నిర్వహిస్తు న్నా రని వారు పేర్కొన్నారు. తాము గత సంవత్సరం బ్రాందీ షాపుల వేలం లో పాల్గొని రూ.2లక్షలు పోగొట్టుకున్నామని వివరించారు. ఇప్పుడు బార్‌కు సంబంధించి ఎలాంటి ప్రకటనలు రాలేదని, జిల్లాలో వేరే మున్సిపాలిటీకి వచ్చిన బార్‌ను ఉరవకొండ పంచాయతీలో ఎలాంటి అనుమతులు లేకుం డా నిర్వహిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై ఎక్సైజ్ సీఐని సంప్రదించినా చర్యలు తీసుకోలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బార్ ఎలా నిర్వహిస్తారని వారు ప్రశ్నించారు. దీనిపై ఆశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వంకల ఆక్రమణపై జేసీ సీరియస్

కూడేరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్కూరు, బ్రాహ్మణపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో వంకల ఆక్రమణపై జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ సీరియస్‌గా పరిగణించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పంటచేలను, వంకలను ఆక్రమించుకుని లే ఔట్లలో కలిపేసుకుంటున్నారు. ఈ అంశంపై ఈనెల 5న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'చేలన్నీ వెంచర్లే' శీర్షికతో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన జేసీ.. క్షేత్రస్థాయికెళ్లి నివేదికలు అందించాలని మైనర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఈఈ రాము, డీఈ రాజ్‌కుమార్, ఏఈ సుధాకర్ ఆక్రమణకు గురైన వంకలను పరిశీలించారు.

ఉపాధి పనులను తనిఖీ చేసిన ఏపీడీ

పుట్లూరు, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరేపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఏపీడీ పుల్లారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించి కూలీల మస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీల హాజరుశాతం పెంచాలన్నారు. ఈసీ అంజన్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ నరేంద్ర పాల్గొన్నారు.

యూరియా పంపిణీపై సభ్యుల ఆగ్రహం

యల్లనూరు, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో యూరియా పంపిణీపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయశాఖ తరఫున ఎంపీఈఓ మధు మాట్లాడుతుండగా యూరియా పంపిణీ అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎందుకు జరగలేదంటూ జడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. వెన్నపూసపల్లి, పాతపల్లి రైతుసేవా కేంద్రాలకు ఎందుకు ఇవ్వడం లేదని ఇక్కడ రైతులు ఎక్కడికి వెళ్లాలంటూ అధికారిని నిలదీశారు. యల్లనూరు సొసైటీలో కేవలం యల్లనూరు రైతులకు మాత్రమే ఇస్తున్నారని మిగిలిన రైతులకు ఇవ్వడం లేదని చిలమకూరు సర్పంచు నాగరాజు ప్రశ్నించారు. సొసైటీ సీఈఓ వీరనారాయణప్ప ప్రస్తుతం ఉన్న స్టాక్‌లో ఈ గ్రామాల్లో రైతులకు అందేలా చూస్తామని తెలియజేశారు. సమావేశంలో ఎంపీడీఓ కరుణసాగర్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ కిటకిట


బస్టాండ్ ప్రాంగణంలో మహిళలు

ఉరవకొండ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కిటకిట లాడింది. ఉచిత ప్రయాణం నేపథ్యంలో బస్టాండ్ ప్రాంగణమంతా మహిళలతోనే నిండిపోయింది. దసరా సెలవులు రావడంతో ఊళ్లకు వెళ్లేందుకు మహిళలు, పిల్లాపాపలతో కలిసి బస్టాండ్‌కు వచ్చారు. ప్రాంగణంలోకి వచ్చిన ప్రతి సర్వీసు కిటకిట లాడింది. అనంతపురం వైపు బస్సులు సరిగ్గా లేకపోవడంతో ఎక్కువసేపు వేచి చూడాల్సి వచ్చింది.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

తాడిపత్రి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సర్ సీవీ రామన్ కళాశాల చైర్మన్ బీవీ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలతోపాటు చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు రంగనాథరెడ్డి, ఓబిరెడ్డి, రంగనాయకులు, కృష్ణమోహన్, రాజారెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

పెద్దవడుగూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ప్రస్తుతం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి ఆయాశాఖల అధికారులు వివరించారు. ఈ సమావేశానికి కొద్దిమంది మాత్రమే హాజరుకావడంతో మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా కొనసాగింది.

ఆలయ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

తాడిపత్రి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరుకోన రంగనాథస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఓగేటి రంగనాయకులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో ఈఓ రామాంజనేయులు ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కమిటీ సభ్యులకు సూచించారు. సభ్యులుగా నాగలక్ష్మమ్మ, రాంప్రసాద్, వెంకటనారాయణ, పద్మ, కిరణ్ కుమార్ ఎంపిక చేశారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, కమిటీ సభ్యులు